# కొత్త కథ

ఆకాశం బద్దకంగా ఉంది. ఎక్కడా మబ్బు తునకల్లేవు చుక్కలు, మిణుగురులు కలిసిపోయాయి.

కళ్లుమూసుకుంటే అనంత కాంతి వలయాలు.. వలయాలనుంచి మిణుగురుల్లా జారుతున్న మనుషులు.. లావూ సన్నం., పొడవూ పొట్టీ., ఆడా మగా., శకలాలుగా., శతఘ్నులుగా.. లావూ సన్నం.. అన్నీ మస్తిష్కంలోంచి క్రమక్రమంగా మాయమవుతున్నా.. వర్ణరహితం.., భావరహితం.. మెలమెల్లగా..దేహం మనసు జారుకుంటున్నా..

"ఏమండీ అప్పుడే పడుకున్నారే.." కవిత.

కళ్ళుమూసుకునే "పొద్దున్నే కథ రాయాలి"

"ఆంహా..నెలనుంచీ రాస్తూనే ఉన్నారు.."

"..లేదు..రేపు పొద్దున్నే గ్యారంటీ..కథ పూర్తయ్యాకే టిఫిన్.."

"సరే చూద్దాం.." లైటాపేసింది.

స్పర్శ...చీకటి..కళ్ళకు., వెచ్చదనం..శరీరానికి..

పల్చటి అడవి..పూల పరిమళం లేని ముళ్లపొదలు.. దట్టంగా అల్లుకున్న తీంద్రతీగలు.. నేలంతా పరచుకున్న దుసారతీగలు.. జింకలు కొమ్ములు ముందుకు చాపుకుని తరుముతున్నాయి.. కుందేళ్ళు పరుగులు తీస్తున్నాయి.. కాళ్లకు దుసారతీగలు తగులుకుని కూలబడతున్నాయి.. ప్రాణభయంతో వెనక్కు చూస్తున్నాయి.. దూరంగా పులి గాండ్రింపు.. ఉడుతలు తమాషా చూస్తున్నాయి.. క్యాటర్‌బాల్‌తో గోచిపాత మనిషి గురి చూస్తున్నాడు.. పొదలోంచి పాము తల బయటకు పెట్టింది.. అన్నిటినీ సమ్మోహ పరుస్తూ పూలపరిమళం.. మత్తుగా.., గమ్మత్తుగా.. చెట్టాపట్టాల్.. అన్నింటిలో అమృతం తాగిన ఆనందం.. ఎంతబాగుందీ దృశ్యం..!

దబదబా..చప్పుడు

దృశ్యాలుమారుతున్నాయి..ఒక్కొక్కటీ అదృశ్యమవుతున్నాయి..

దబదబా చప్పుడు..

"అనా..వెంకటేశన్నా.. మా ఇల్లు కాలిపోతాందినా.."

మస్తిష్కం మెలమెల్లగా చైతన్యమవుతోంది.

"నాయనా వెంకటేష్..బయటెవురో పిలుస్తాండారు.."

"ఎవురుమా.." హమ్మయ్యా.. పూర్తిగా నిద్ర మత్తు పోయిందా..?

"నేను భాస్కర్‌నునా..మా ఇల్లు కాలిపోతాందినా.."

"ఆఁ...భాస్కర్ వస్తాండా.." టైమెంత..? రెండూ నాలుగు.. తగిలించిన చొక్కాయి.. తగిలించుకో.. సెల్ ప్రియురాలిని జోబీలే వేసుకో.. కవిత బద్ధకంగా అటు తిరిగింది. నువ్వు ఇటు పరిగెత్తు..

పడకగది తలుపు తీసావా..? హాలంతా లైటు వెలుగు.. అమ్మ మాట్లాడుతోంది.. భయంగా, కంగారుగా రమణ..

చెప్పులు వేసుకో.. ఇరుగుపొరుగును కేకెయ్..

గబగబా నడు.. పరిగెత్తుతున్నావా.. ఎందుకు.. పక్కవీధేకదా..

"గాలి వచ్చిందినా.. కరెంటు వైర్లు రాసుకోని అగ్గి కొటం మింద పడింది. టయానికి నేను ఒంటికి పోసేదానికి బయటొచ్చిన్నే.. లేకుంటే తెల్లారేలకు మాశవాలను చూసిందువు.."

విషయం చెపుతున్నాడా.. ఏడుస్తున్నాడా..?

ఐదారు మంది బకెట్లతో నీళ్ళు చల్లుతున్నారు.. నీవెనకా సుమారు పదిమంది.. ఇంటిమీద పొగ., నాల్కలు చాపుతూ మంటలు.. ఇద్దరు ముసలి వాళ్ళ ఏడుపులు.. పిల్లల భయం చూపులు.. వాతావరణం వేడిగా..

కొచెం కూడా తెలివుండదు వీళ్ళకు.."ముందుగా చూరు కట్లు విప్పండి. చుట్టూ చూరు పట్టుకుని పైకి లేపితే కప్పు కూలిపోతుంది. మంటలు ఆర్పడం ఈజీ.. గాలికి మంటలు పక్క ఇళ్లకు పోవు.."

కాలమేదైనా, స్థలమేదైనా యువతే ముందుంటుంది..చూరు కట్లు విప్పుతున్నారు.

"భాస్కర్..ఫైర్ స్టేషన్ వాళ్ళకు ఫోన్ చేశావా..?"

తెలివి తక్కువ మనిషి.. తెల్లముఖంతో "లేదనా..మంటలు చూస్తానే నేరుగా నీ దగ్గరకే వచ్చేసినా.. నెంబర్ తెలీదునా"

"ఆ మాత్రం తెలీక పోతే ఎట్ల..?" జోబీలోంచి సెల్ తీ.. 101 నొక్కు.. ఎంగేజా.. ఇంకెక్కడయినా ఇల్లుకాలుతోందా..? వాళ్ళు ఫోన్‌లో మాట్లాడుతున్నారా.. ఆఁ.. రింగవుతోంది.. "హలో.. చిత్తూరు గిరింపేటనుంచండీ.. నాలుగో సందులో రెండో ఇల్లు కాలిపోతాంది.. వెంటనే రావాలి.. మా ప్రయత్నాలు చేస్తున్నాం.." ఆమాత్రం తెలీదా మా ప్రయత్నాలు చేయడం.. ఇల్లు కాలతాంటే ఎవరైనా చేతులు కట్టుకోనుంటారా.. వెధవ ప్రశ్న.. కట్లు విప్పేసినారు.. నువ్వొక చేయి వెయ్..

వేడి సెగలు..

"పట్టండి..అందరూ చుట్టూ పట్టుకోండి.. గట్టిగా లేపండి... ఊఁ.. ఇంకొద్దిగా.. పట్టండి.. ఆఁ.. అమ్మయ్య.. కప్పు కూలిపోయింది.."

"గబగబా నీళ్ల పోయండి.." గోలగోలగా ఉంది.

మంటలు ఆరిపోయాయి. కూలిన కప్పులోంచి పొగ., గాలికి వలయాలు వలయాలుగా..

భాస్కర్ ముఖంలో బాధ.. చుట్టూ ఉన్నవారిలో ఆనందం.. గణగణ గంట చప్పుడు.

"ఫైరింజన్ వస్తాంది.."

"ఎప్పుడూ ఇంతే.. ఇల్లు కాలిన ఏడుదినాలకు వస్తారు ఈళ్ళు.."

ఫైరింజన్ ఆగింది.. సిబ్బంది దిగారు.

"మంటలు ఆర్పేశారా..?"

నువ్వు పరిచయం చేసుకో.."నేనే సార్ మీకు ఫోన్ చేసింది.. మంటలు ఇప్పుడే ఆర్పేశాం..మీరు వచ్చినందుకు థ్యాంక్స్ సార్"

"అనవసరంగా మా నిద్ర పాడు చేస్తిరే.." పైకి.. లోపల బూతులు..

గణగణా..దారి పొడుక్కూ అందరినీ నిద్రలేపుతూ ఫైరింజన్ తిరుగుముఖం..

"భాస్కర్.. జాగ్రత్త..పొద్దన్నే ఎమ్మార్వో ఆఫీసుకు పోయి అర్జీ ఇవ్వు..తక్షణ సాయం చేస్తారు.. నాతో ఏదన్నా అవసరం అయితే ఫోన్ చేయి.. వస్తా" అవులింత.. నిద్రా..కథ రాయవా..కళ్ళు మండుతున్నాయి.

"సరేన్నా.."

పదపదా.. వెనకనుంచీ చెవుల్లో దూరుతున్న మాటలు..

"ఈ పక్కన ఎవురూ లేరా.. పాపం అందూరం పోయి నిద్ర లేపినావే అయప్పను.."

"వెంకటేష్ కాబట్టి గబగబా అందరినీ లేపినాడు..ఫైరింజనోళ్ళకు ఫోన్ చేసినాడు.. ఇంగెవురన్నా అయింటే ఈ పనులన్నీ చేసిందురా..?"

అమాయకులు..ఆ సమయంలో ఎవరున్నా అంతే కదా.. అయితే నీ గొప్పదనం ఏమీ లేదా.? ఏముంది..?

"కొక్కొరో..కో.."

ఇంటిముందే అమ్మ ఆదుర్దా.."ఆర్పేస్తిరా.."

తలూపు..మాట్లాడేదానికేం..

"ఎంతనష్టం..?"

"ఏమోమా..ఎక్కువ ఉండకపోవచ్చు.. టయానికి చూసుకున్నాం కదా.."

దాహంగా వుంది.. కుండలో నీళ్ళు తాగు.

కథ రాస్తా.. నిద్ర రావటం లేదా.. కళ్ళు మూతలు పడుతున్నాయి.. టైమెంత.. నాలుగూ ఐదు..పొద్దన్నే ఆరుగంటలకు లేచి.. కొత్తకథను రాసేసి..

"ఏంబా..నెలనుంచీ కథ రాస్తానంటానే ఉండావే.. కథెప్పుడు రాస్తావు?" కవిత కలవరిస్తోంది..

లేపదామా.. వద్దా..

చేయి వేయనా..వద్దా..

మనసు ద్వారాలను మూస్తూ కళ్లు మూతలు..

'నిలువుమా నీలవేణీ.. నిలు నిలువుమా నీలవేణీ..' సెల్ ప్రియురాలు పిలుస్తోంది. స్పర్శించకపోతే అలుగుతుంది. నిద్రను నిలపాల్సిందే.. కనురెప్పలు కదలనంటున్నాయి.. తప్పదు.. కదలాల్సిందే.. తలదగ్గరే సెల్.. చేతిలోకి తీసుకో.. టైమెంత..? ఏడు.. పక్కన ఖాళీ.. కవిత మార్నింగ్ వాక్ పోయింది..

ఇంత పొద్దన్నే ఎవరినుంచీ ఫోన్..కళ్ళు తెరిచి చూడు.. కిటికీలోంచి వెలుతురు

కిరణాలు.. కళ్ళు తెరుచుకోవడం లేదు.. పేరు చూడకపోతే మాట్లాడవా..

"హలో..హలో..ఆఁ...నేనే..పిన్నీ..ఏమీ..ఆఁ..ఆఁ..ఆఁ..ఆఁ..అలా ఎందుకు చేశాడు.. వినలేదా..? నేనొక అరగంటలో అక్కడుంటా.. సరే..ఉంటా.."

నిద్రమత్తంతా పోయింది.

అమ్మ టీ కప్పుతో వచ్చింది.

"అమా..సురేష్ గాడు లలితను జీతం డబ్బంతా ఈలేదని కొట్టి రాత్రి బయట తోసేసినాడంట. ఇప్పుడు కూడా వాడు ఇంట్లోకి రానీలేదంట..పిన్ని ఫోన్ చేసింది. పోయొస్తా.."

"బంగారట్ల బిడ్డ..వానింట్లో పడి బాధలు పడతాందే.. ఆ ఎధవ తాగకపోతే వానంత మంచోడు ఇంగోడుండడు. వోని నోరు మంచిదిగాదు నాయనా.. అనుమానం మనిషి కూడా..లలిత చెప్పి ఒగరోజు గోడుగోడుమని ఏడ్చింది. నువ్వు పోకుంటే మేలేమో.."

ఇంకెవరు పోతారు..?

"నాకూ తెలుసుమా.. నేను విషయం తెలీనట్టుగా పోయి మాట్లాడొస్తా.."

"గుడ్‌మార్నింగ్ నాన్నా.." ఆరేళ్ల కల(ళ)ల పంట.

"గుడ్‌మార్నింగ్‌రా.. చిన్న పనుంది..బయటెళ్తున్నా..ఇవ్వాళ సెలవు పెట్టా.. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి తీసుకొస్తా.."

"హాయ్..భలే..భలే.." అప్పుడే విచ్చుకున్న మందారంలా నవ్వు.

నిజంగా నువ్వు నర్మాలుకు పోతావా.. పోతాను.. కథ రాయవా.. రాస్తాను..సెలవెందుకుపెట్టావు.. తెలుసు.. ఆవేళకు పూర్తవుతుంది.. నిజమా.. అనుమానమా.. కూర్చుంటే ఎంతసేపు.., నాలుగ్గంటలు చాలు..ఆఁహా..అంత మొనగాడివా కథలు రాయటంలో.. కాదు.. నాలుగు నెలలనుంచీ మధన జరుగుతోంది., నెలనుంచీ రాయాలనుకుంటున్నా.. తీరిక లేకే.. అయితే ఈ రోజు తీరిక ఉందా.. సెలవు పెట్టింది అందుకే కదా..

"ఎలబారు నాయనా.. ఆ బిడ్డ పాపం బయటే ఉండాదంటివే.. డ్యూటీకి పోవద్దా.."

చకచకా తయారవ్వు.. నోరు వాసన రాకుండా బ్రష్ చేసుకుంటే చాల్లే.. స్నానం.. ఇంటికిరావా.. అక్కడే ఉంటావా.. మూడేళ్లకు ముందు ఉండేవాడిని.. తర్వాతేమయింది.. సురేష్‌కు పెళ్లయింది.. వాడు నిన్ను రావద్దన్నాడా.. రావద్దని చెప్పాల్నా.. అలా ప్రవర్తిస్తే చాలదా.. ఎందుకంత అనుమానం.. ఎందుకంత తాగుడు.. బుద్ధి లేని వెధవ.. బంధువుల్లోగానీ, స్నేహితుల్లో గానీ ఇలాంటి వాడు లేడు.. ఇలా ఎందుకు మారాడో.. ఇక మామూలు మనిషికాడా.. లలిత అలా జీవితాంతం బాధ పడాల్సిందేనా..? జీవితాంతం.. అంటే.., జీవితకాలమెంత..? నూరేళ్ళు.. నిజంగానా.. కాదా.. ప్రమాదం జరిగి ఇప్పుడే పోవచ్చు.. భర్తపైన విసిగి ఈ రోజే ఆత్మహత్య చేసుకోవచ్చు.. ఆఁ..అలా జరగనివ్వను.. ఏం చేస్తావు..? మార్గం ఉంది.. మానసిక వైద్యం..

కవిత దార్లో ఎదురు పడుతుందేమో.. అమ్మ వంట పనిలో ఉంది..

"పోయొస్తామా.."

"తొందరగా వచ్చేయ్.."

ఎంతసేపు., బైక్‌లో పోయిరావడం.. అక్కడొక పదినిముషాలంతే..అంతే..

చలిచలి.. మనుషులు తమలోకి తాము ముడుచుకు పోయేలా.. లోలోపలికి.. తనకు తనే అర్థం కానంత లోపలికి.. ఒకరికొకరు., ఎవరికెవరూ అర్థం కానంత లోపలికి.. ఏకాంత ప్రియులు.. ఏ.. కాంత ప్రియులు.. నాతి చెరామి.. రోడ్డు పక్కన మనిషి.. మత్తుగా.. మెలకువలేకుండా.. నిద్రా.., మందా..? ఏదైతేనేం.. మత్తు ముఖ్యం.. తనను తాను బంధించుకోవడానికి.., కుళ్ళును కుతంత్రాలను బాధితులను పట్టించుకోకుండా ఉండటానికి.. మత్తు ఉపయోగపడుతుందా.. పడదా.. పడేయదా.. సుడిగుండంలో చిక్కి ఉక్కిరి బిక్కిరై, బయటరాలేక లోపల్లోపలకి.. లోలోతుల్లోకి.. అంధకారంలోకి.. అజ్ఞానంలోకి..

"పోపోరా..నీతులు బలే చెప్పేవోడు ఈడు.." ఎవడు వాడు.. గుడిసింటి రాముడు.. డబ్బుకు, మందుకు గుడిసేటి రాముడు..

నిలువుమా నీలవేణీ..నిలు నిలువుమా నీలవేణీ..సెల్ ప్రియురాలు పిలుస్తోంది. బైక్ ఆపు..హమ్మయ్య..నడత తెలిసినవాడివే..

"హలో..ఏరా..ఈ పొద్దు గ్రౌండుకు రావటం లేదురా.. మా పిన్ని వాళ్లింటికి వెళుతున్నా..ఈ రోజు ఆఫీసుకుపోవడం లేదు. కథ రాయాలి.. సెలవు పెట్టా.. థాంక్యూ.. కథ రాయకముందే బెస్టాఫ్ లక్ చెప్తున్నావే..బై..కథ రాసేసాక ఫోన్ చేస్తా.."

"ఎంగటేశ్ సార్..నమస్తే.."

"నమస్తే..బాగుందావా.." స్టార్ట్ చేయ్..అక్కడెలా ఉందో పరిస్థితి..

"సార్..సార్..లోను సంగతి ఏమయింది సార్.." దీనంగా..

ఇంజన్ ఆపేశావా.. కుంటి నారాయణ.. కుశాల లేని నారాయణ..

"మాట్లాడాను.. లక్ష రూపాయలు ఇచ్చినా వ్యాపారం చేసుకోలేనన్నావు.. అందుకే లక్ష సాంక్షన్ చేసి సబ్సిడీ ముప్పై వేలు ఇవ్వమని చెప్పా.. ముందుగా మేనేజర్ వొప్పుకోలేదు.. లోన్ యిచ్చే ఉద్దేశం లబ్ధిదారుడు బాగుపడాలి, మీకు మనీ రికవరీ కావాలి. అంతే కదా.. నేను చెప్పిన విధంగా చేస్తే అతను చిన్న బంకు పెట్టుకుంటాడు. బతుక్కుంటాడు..మీ మనీ మీ దగ్గరే ఉంటుంది అని చెప్పాను. చివరకు కన్విన్స్ అయ్యాడు. ఢిల్లీకి క్యాంప్ పోయిండాడు. ఇంకో నాలుగు రోజుల్లో వస్తాడు. మేనేజర్ వస్తానే నీ పనయి పోతాదిలే"

చలి తగ్గుతోంది.. ఎండ చురుకు తగులుతోంది.. నిద్రమొహాలతో చేతిలో నీళ్ళ చెంబులతో ఇద్దరు మగవాళ్లు వెళుతున్నారు..

"ఎన్నేండ్లగానో అందుర్నీ అడిగినా సార్.. ఇంతవరకూ ఎవురేగానీ లోనిప్పీలా.."

"చెప్పాను కదా..నీకు నాలుగు రోజుల్లో ముప్పై వేలు చేతికి వస్తె ఈ లోపల ఎక్కడన్నా బంకు ఉంటే బేరం చేసుకో.. డబ్బు వస్తానే కొనుక్కుందువు.. వస్తా.. నాకు పనుంది"

"నమస్కారం సార్..ఉంటాసార్"

వాయు వేగమా.. మనో వేగమా.. మనిషి పోయే వేగమే ఇష్టం.. అయితే నువ్వు మనిషి చేసే పనులే చేస్తున్నావా..? ఔను..వూర్లో అందరి పనులూ నీవేకదా.. తప్పేముంది..

మనను సాయం అడిగినప్పుడు చేతనయినపని చేస్తేనేం.. అయితే నీకంటూ పనులు ఉండవా.. నీ కంటూ గుర్తింపు వద్దా.. స్వంత గుర్తింపు ముఖ్యమా.., సమష్టి ప్రయోజనం ముఖ్యమా..?

బెంగళూరు బైపాస్ రోడ్ మత్తుగా పడుకోనుంది.. టీ అంగళ్ల దగ్గర రాజకీయాలు రగులుకుంటున్నాయి.. మలుపు దగ్గర పరిమళం తగ్గిన పూలను నీలిమందులో అద్దుతోంది పూలమ్మి.. పండిన అరటి పళ్లు ఎప్పటికి ఖాళీ అవుతాయో అన్నట్టు దీర్ఘంగా చూస్తున్నాడతను. బైక్ యువకుడొకడు రోడ్డు నియమాలు పాటించలేదు.. కర్నాటక బస్సు కొంపలంటుకున్నట్టు హారన్‌తో పోతోంది.. సెలూన్ షాపు ముందు పేపరు శకలాలు గాలికి కదలాడుతున్నాయి..

నిన్ను చూడగానే లలిత కళ్లలో నీళ్లు.. గ్రహణం పట్టిన చంద్రునిలాంటి ముఖం.., అటు తిప్పుకుంది.. ఇటు పక్క బైక్ ఆపు..

"ఏమా..ఇంటి ముందు కుచ్చోనుండావు.. ఎనిమిదవుతాంది.. ఆఫీసు లేదా.." మంచి నటుడివే.. అమాయకంగా ప్రశ్నలు సంధిస్తున్నావు..

మంచి జరుగుతుందన్నపుడు నటించడంలో తప్పులేదేమో.. నటన లేందెక్కడ.., స్థాయీ భేదం తప్పితే..

"పోవాలనా.." రాత్రి దుఃఖం గొంతులో బొంగురుగా ధ్వనించింది.

"రా..నాయనా..బాగుండావా..ఈ పక్క వచ్చేదే మానుకున్నావే.. రేయ్ సురేష్.. మీ అన్నొచ్చినాడు చూడు.. ఇట్ల కుర్చీలో కూర్చో"

విశాలమైన ఆ ఇంటిలో ఊపిరాడ్డంలేదు..

టివి మౌనం మహా వింత..

సురేష్ మౌనం మహా విస్ఫోటనం..

"రేయ్..సురేష్..వెంకటేష్ వచ్చినాడు మాట్లాడరా.." కాఫీ కలుపుతోంది పిన్ని..

"బాగుండావానా..ఇంటికి వచ్చేదే మానేసినావే..నేనొద్దామంటే కుదరడమే లేదునా.." ముఖంమీది మాటలు.. ప్లాస్టిక్ నవ్వు.. నువ్వూ నవ్వు..

"కాఫీ తీసుకో నాయనా.. అమ్మ బాగుందా..కవిత బాగుందా.."

..వేడిగా ఉంది..చల్లబడనీ..మెల్లగా తాగు..

"అందరూ బాగుండారు పిన్నీ..కవిత మార్నింగ్ వాక్ పోయింది.అమ్మ వంట చేస్తాన్నింది. లలితా ఏం బయటే ఉండాదే..? డ్యూటీ లేదా ఈ రోజు."

"ఉండాది నాయనా.. ఎందుకు లేదు.. అమ్మా లలితా.. మీ బావతో మాట్లాడినావా.. నిద్ర లేస్తానే ఇంటి ముందరికి పోయి కుచ్చొన్నేవే.. రా.. వచ్చి రెడీకా.."

పిన్ని మాటలు అయిపోక ముందే లలిత లోపలికి వచ్చింది. సురేష్ ఉరిమి చూస్తున్నాడు. పొడి దగ్గు దగ్గాడు. బెరుగ్గానే బాత్‌రూంలో దూరింది లలిత.

సురేష్ ఆలోచనలు మళ్ళించు. "ఏం సురేష్ కళ్లు ఎర్రగా ఉన్నాయే.."

ముఖంలో తడబాటు.."రాత్రినుంచి తలనొప్పి..పడుకుంటానా.."

ఎవరిమాటా వినడు, ఎవరి సమాధానం కోసం ఎదురు చూడడు.. బెడ్‌రూంలోకి పోతున్న కొడుకును చూస్తోంది పిన్ని.. ముఖంలో బాధ..

కొడుకుది జబ్బు.. నయం చేపిస్తా.. బాధ పోగొడతా.. అంటే వినిందా..? కాకిపిల్ల కాకికి ముద్దు.. కథ సుఖాంతం.. నువ్వు ఇంటికి పదా.. నీకు లేదా పని..

"వస్తా పిన్ని.."

నీతోపాటు పిన్ని వస్తోంది..ఏదన్నా మాట్లాడుతుందేమో..ఇంటి ముందు ఆగు..

"అప్పటికీ ఇప్పటికీ వోడింకా అధ్వాన్నం అయిపోయినాడు..సైకియాట్రిస్టు దగ్గర చూపిద్దాం.. మాట్లాడు" మాటల్లో బేలతనం.

అప్పుడు చెప్తే వింటివా..నా కొడుకు బంగారం అంటివే.. సంసారం వీధిలో పడితేగానీ పరిస్థితి అర్థం కాదా..

"సరే..పిన్నీ.. తిరుపతిలో తెలిసిన వాళ్ళుండారు.. రెండుమూడు రోజుల్లో పోదాం.."

"నీ మాటిని అప్పుడే పోయింటే బాగుండు.." పిన్ని గొనుగుతోంది.

తల ఊపావా.."వస్తా పిన్నీ..సైకియాట్రిస్ట్‌తో మాట్లాడాక ఫోన్ చేస్తాలే"

త్వరగా పోనీ బైక్‌ను. టైము తొమ్మిది.. ఈ పాటికి కల(ళ)లపంట స్కూలుకు పోయుంటుది.. కవిత ఏంచేస్తాంటింది.. వంటా.. సన్నబడ్డానికా.., తింటానికా.. కొత్త కథ రాయాలి..సైకియాట్రిస్ట్‌కు ఫోన్ చేయాలి.. ఎండగా ఉంది.. ఈరోజింకా పేపర్ చూడలేదు.. ఏముంటుంది.. హత్యలు ఆత్మహత్యలు ఆకలి చావులు.. అంతేనా.. నాయకుల నీటి మూటల హామీలు.. అధికారుల పనుల ఆరంభ శూరత్వాలు.. పసిమొగ్గలపై పైశాచికత్వాలు..

"నమస్తే సార్.." సైకిల్‌ను దాటేశావు.

"నమస్తే.." ఎవరితను..ఎక్క..డో.చూసినట్టే ఉంది.. ఎక్కడా.. బైరెడ్డిపల్లె ఎంపిడివో ఆఫీసులో.. పిఎంఆర్‌వై దరఖాస్తుకోసం వచ్చాడు.. ఏమయింది.. లోను వచ్చిందా..రోడ్డుకు అడ్డంగా జీపు వచ్చింది..

"బుద్ధుందా..ఆ మాదిరితో అడ్డంగా దూరితే జనాలు ఏమవుతారు.."

"పోరారే.." జీపు..డ్రైవర్..వేగం..

"కొంచెమయింటే మిమ్మల్ను గుద్దేసిండేవాడు సార్.. కొంచెంలో తప్పోయింది.."

అమాయకుడు.. మనిషిని చావు ఎప్పుడూ వెన్నంటే ఉంటుందనే సంగతి తెలిసినట్టు లేదు.. కథ కూడా వెన్నంటే ఉంటుందా.. ఉంటుంది.. అయితే ఎందుకు నువ్వు రాయడం లేదు.. రాస్తా.. ఈ రోజు ఎలాగైనా కథ రాసేస్తా.. హమ్మయ్య ఇంటికి వచ్చేశా..

లో.. లోపలికి చొచ్చుకు పోయేలా కవిత చూపు.. పట్టించుకోవద్దు.. పట్టించుకోకనే కదా.. సురేష్.. సైకియాట్రిస్ట్.. పుస్తకాలు వెతుకు..

"ఫస్ట్ టిఫిన్ తినండి.. మళ్ళీ పుస్తకాలు చూసుకుందురు.."

ఫస్ట్..ఏది..ఫస్ట్..కథా, టిఫినా, సైకియాట్రిస్టు అడ్రస్సా..ఫస్ట్..వెతుకు వెతుకు..వెతికే వాడికే దొరుకుతుందంట ఏదైనా.. వెతికే వాడికి ఏదైనా దొరుకుతుందా.. ఉండే చోట వెతికితే ఎందుకు దొరకదు.. ఉండే చోటు తెలిసేదెలా.. బుర్రకు పదును పెట్టు.. శరీరానికే కాదు, మనసుకూ వ్యాయామం తగ్గించేస్తున్నావు.. చూడాల్సిన పుస్తకాలు తగ్గిపోయాయి.. ఇంక ఒక్కటుంది.. హమ్మయ్య..హైదరాబాద్ సైకియాట్రిస్టులు.. ఫోన్ చేయ్.. మాట్లాడు.. మిత్రుడు.. నంబర్ తీసుకో.. వైజాగ్.. నంబర్ తీసుకో.. బెంగుళూరు.. ఫోన్ కొట్టు.. తిరుపతి..

హైదరాబాదా, వైజాగా, బెంగళూరా, తిరుపతా..? ఏది రైటు..సురేషుకు ఏది సూటు..తిరుపతే..ఓకే..

"రండి టిఫిన్ తిందురు.."

"ఓకే..వస్తున్నా.." గబగబా వళ్ళు తోము.. ఎందుకు..నోరు శుభ్రంగా ఉండటానికి..శుభ్రంగా ఉంటే ఎదుటి మనిషిని తిట్టచ్చా.. ఏమార్చచ్చా.. స్నానం చెయ్.. గోరువెచ్చటి నీళ్ళు.. బాగా తోము శరీరాన్ని.. ఒకటికి రెండుసార్లు శరీరాన్ని తోము.. మనసును దేనితో తోమను.. నువ్వు తోముకోవాలా మనసును..? ఒక్కసారి వీధిలోకి పో.. ఒక్కసారి జనం మనసుల్లోకి పో..చూశావా..మకిలిని..

"స్మెల్ బాగుందే.. ఏం టిఫినూ.. ఆహా.. బిసిబిలేబాత్.." అంత తొందరెందుకు నోరు కాలిందా..న్యూస్ పేపర్ చూడనేలేదు..టిఫిను చల్లారలేదు..చెట్టును ఢీకొన్న బస్సు.. ఇద్దరి మృతి..అదృష్టవంతులు..ఆరేళ్ల బాలికపై అత్యాచారం.. వాడిని అంతం చేయాలి..క్యాన్సర్ బాలునికి ఆర్థిక సాయం చేయండి...ప్రయత్నిద్దాం.. స్టాలిన్ విడుదల రేపే.. మరి బాస్.. బొమ్మరిల్లుకు పోయావా..అందాలరాముడేమంటున్నాడు..

"చల్లగా అయిపొయనండీ టిఫిను.తినండీ పేపర్ మళ్ళ చదువుదురు" శ్రీమతి గోల..అమ్మ గుడికి పోయినట్టుంది.

తినేశావా..మంచమెక్కు..రాస్తున్నావా..

"కథ మొదలు పెట్టావా.." కవిత..ఉత్సాహం..

"కాదు ఉత్తరం..క్యాన్సర్ పేషంట్‌కు..సాయం అందే మార్గాల గురించి.."

"రేపు రాసిండచ్చు కదా..ముందుగా కథ రాసేయ కూడదా..?"

ఏది ముందు.. ఏది వెనుక.. ఏది వెనుక.. ఏది ముందు..తెలుసుకునేదెప్పుడు..వివరాలన్నీ రాయి..దరఖాస్తు ఫారం ట్రైపాడ్ మేటర్ లేదా.. జబ్బును బట్టి మారుతుంది కదా.. పుర్రెకోబుద్ధిలా.. సమయమెంత..పదకొండు..పోస్ట్ పన్నెండుకు తీస్తారు..త్వరగా వెళ్ళాలి..రోగికి వైద్యం ఎంత తొందరగా అందితే అంత మంచిది కదా..

"పోస్ట్ చేసొస్తా.."

"అక్కడ ఎవరితో అంటే వాళ్లతో మాటలు పెట్టుకోకుండా, తొందరగా వచ్చి కథ మొదలు పెట్టండి.. లేకుంటే సెలవు పెట్టీ వేస్టే.."

వేస్ట్..వేస్ట్..వేస్ట్..జీవితంలో ఎన్ని వేస్ట్ పనులు చేస్తున్నాం..

పోస్ట్..పోస్ట్..పోస్ట్..ఎందరి జీవితాల్లో వెలుగు నింపుతోంది.

పోస్ట్ చేసేశావా.. అయితే ఇంటికి పోయి కథ రాయి.. రాస్తా.. బైక్ లాక్‌చేయి.. మైండ్ లాక్ ఓపెన్ చేయి..

బెడ్ రూంలో దూరావా..పెన్, ప్యాడ్, వైట్ పేపర్స్..

ఎలా మొదలు పెట్టను.. అలానా, ఇలానా.. ఇలానా అలానా.. బ్యాంక్ మేనేజర్ వస్తానే అతనికి లోన్ ఇప్పించాలి.. ప్రారంభంలో ఏది ముగింపులో ఏది.. ముగింపు ప్రారంభం చేసి ప్రారంభం ముగింపు చేస్తే.. రేపు ఎమ్మార్వోకు చెప్పి పక్కా ఇల్లు శాంక్షన్ చేపించాలి.. అలా కాదు.. ఇలా.. ఇలా కాదు..అలా..సైకియాట్రిస్టుకు సాయంత్రం ఫోన్ చేయాలి..

"ఏమండీ ఇంకా కథ మొదలు పెట్టనే లేదా..టీ ఇవ్వనా..?"

తే..నీరు..నీరు కావాలి. తాగడానికి.. కవితకు తెలుసు.. ముందు నీళ్లగ్లాసు.. వెనక పొగలు కక్కే టీ.. గుక్కగుక్కకూ చలనం.. మెదడు పొరల్లో.. కథ రాసేయాలి.. ఎలాగైనా రాసేయాలి.. టైమెంత.. పన్నెండు పది.. పన్నెండున్నరకు కల(ళ)ల పంట దగ్గరకు పోవాలి.. ఆలోపు ప్రారంభం చేసేయాలి..చాలా బలంగా..భారీ కాయం మీద..మొదలు పెట్టేస్తా..

ఆమె వెన్నెలను తాగిన జాజితీగలా ఉన్న తన ఫోటోను తదేకంగా చూస్తోంది..గాలి ఊదిన బూరలా ఉన్న తన దేహం గురించి ఆలోచిస్తోంది.. ఏవి తల్లీ నిరుడు నాపై కురిసిన సౌందర్య రేఖలు..

"ఏమండీ పాపకు స్కూలుకు టైమవుతాంది..మీరొస్తానన్నారంట.." కవిత కథకు అడ్డుపడింది..

మాటిచ్చాను..పోయిరావాలి..

గబగబా..కల(ళ)లపంట కళ్ళలో కళకళ.. నువ్వు చెప్పిన రోజు ఎప్పుడైనా పోతే కదా..ఈ రోజు వచ్చినా కదా..అందుకే కదా ఆ కళకళ..అందుకేనా..

గలాగలా పొంగుతున్న గోదారిలా.. పాటా.. పాప మాటా.. పాటా మాటా.. మాటా పాటా.. గలాగలా పొంగుతున్న గోదారిలా..

"అమ్మా..బై..ఫాస్ట్‌గా పోనీ నాన్నా.." ఫాస్ట్..ఫాస్ట్..అన్నీ ఫాస్ట్.. ఆటలు, అనుబంధాలు, అభిమానాలు అన్నీ.. ఫాస్ట్ ఈజ్ ఫాస్ట్.

"ఏమయిందండీ.." చుట్టూ పిల్లలు.. టీచర్లు.. మధ్యలో శిలువ వేయబడ్డ క్రీస్తులా హెచ్ఎం..

"బై నాన్నా.."

గందరగోళం..మాటలు.. అర్థ కావడం లేదు..

"ఏమయిందండీ.."

ప్రైవేటు స్కూలు హెచ్ఎం కళ్ళలో నీళ్ళు...ఏదో చెప్పాలనుకుంటున్నాడు.. మాట పెగలడం లేదు..

"సార్ మదనపల్లెనుంచీ బస్సులో వచ్చినాడంట.. వాళ్ళ మిసెస్‌వాళ్ళు అక్కడే బంధువుల ఇంటిలో ఉండిపోయారు.."

"సార్ వాళ్లమ్మాయికి దగ్గర్లో పెళ్ళి ఉంది కదా.. మదనపల్లెలో నగలు చేయించారంట.."

"ఒగటిన్నర లక్ష.. మేడం వాళ్ళు సాయంత్రం బయలు దేరతారంట..సార్ నగలు తీసుకోని వచ్చేసినారు..నగలు, బట్టలు బ్యాగ్‌లో ఉన్నాయి. ఆ బ్యాగ్ బస్సులో మరచిపోయి దిగేసినారంట.."

"ఎట్ల చేసేదండీ..మా అమ్మాయి పెళ్ళికోసం పల్లెలో పొలం అమ్మాము." హెచ్‌ఎం గొంతు పెగిలింది..

"ఏ డిపో బస్సది.."

"మదనపల్లెది.."

"వెంటనే డిపో వాళ్ళకు ఫోన్ చేయలేదా..?"

"చేశాం సార్..మా భార్య, పాప అక్కడే బస్టాండులో ఉన్నారు..మేమేం చేసేదండీ అంటున్నారు సార్.." మళ్ళీ ఏడుపు.. ఏడుపు.. సమస్య వస్తే ఏడుపు తప్ప పరిష్కారమే లేదా..

"మీ దగ్గర ఎవ్వరి నంబర్ ఉంది.."

"క్లర్క్ మాట్లాడాడు సార్..ఇదీ నెంబర్.."

సెల్ ప్రియురాలిని తీ..నంబర్ నొక్కావా..రింగవుతోంది.."హలో..నేను చిత్తూరు నుంచండీ..ఇక్కడ మాదొక బ్యాగ్ బస్సులో మరచి పోయాం.."

పూర్తిగా మట్లాడనీడే.

"ఔనండీ..ఇంతకు ముందే ఒకతను చెప్పాడు..మేమేం చేసేది..బస్సొచ్చాక చూస్తాం..ఉంటే ఇస్తాం.." విసుగు..

"ఒకసారి మీ డిఎం నంబర్ చెప్తారా..?"

"మీరెవరండీ.."

"నేను జడ్‌పి క్యాంప్ క్లర్క్‌ను.."

"నమస్తే సార్..చెప్పండిసార్.."

"ఒకసారి డిఎం నంబర్‌చెప్పారంటే.., నేనే ఫోన్ చేస్తాను..బ్యాగువిషయం.."

"అవసరం లేదు సార్..నేను చెప్తాను సార్.."

"డిఎం గారికి చెప్పండి.. మా వాళ్లదే బ్యాగు.. అందులో విలువైన వస్తువులున్నాయి.."

"ఏం భయంలేదు సార్.. జాగ్రత్తగా ఉంటాయి సార్.. మీ నెంబర్ చెప్పండి..చేస్తాను.."

"అరగంటాగి నేనే చేస్తాలే..ఉంటా.."

"బ్యాగు దొరుకుతుందాసార్." ఏడుపు..మాటలు..

కూర్చో..ఆపదలో తెలుస్తుంది మనిషి శక్తి ఏమిటో.. ధైర్యం చెప్పు.. తేరుకుంటున్నాడు.. బాగా మాట్లాడుతున్నాడు.. పావుగంటయింది.. ఫోన్ చేయి..

"హలో..నేనండీ.."

"సార్..సార్..డిఎం సార్‌కు చెప్పాను..ఇక్కడినుంచి జీప్ పంపారు..అక్కడికి వాళ్ళు

చేరతానే ఫోన్ చేస్తారు.. ఏం భయంలేదు సార్.. ఇక్కడే మేడం వాళ్లున్నారు సార్.. ఇవ్వనా.. హలో.. సార్.. బ్యాగు దొరుకుతుందా..” ఏడుపు..

“మీకేం భయం లేదు మేడం.. అందర్నీ అలర్ట్ చేశాం.. తప్పకుండా దొరుకుతుంది.. అక్కడే ఉండండి”

జీవితం కథ.. కథ రాయవా.. కథ.. జీవితం.. జీవిత కథ.. కథలాంటి జీవితం.. కథే జీవితం.. జీవితమే కథ.. కథ కథే.. కానేకాదు.. కథ రాయాలి..

టీచర్లందరూ క్లాసులకు వెళ్ళారు..హెచ్ఎం.. పక్కన నువ్వు.. మనిషి ఎప్పుడూ ఒంటరి.. చుట్టూ సమూహం.. సమూహంలో ఒంటరి.. ఒంటరి సమూహం.. శకలాలు శకలాలు.. ఏకాకి.. కాకికాదు.. ఏకాకి.. అన్నం మెతుకులు.. కావ్ కావ్ కాకి అరుపులు.. గుంపులు గుంపులు కాకులు.. సమూహం.. పిల్లకాకి కింద పడిపోయింది.. కావ్‌కావ్..కాకుల అరుపులు.. ఏకాకి.. దిగులుదిగులుగా.. భయంభయంగా.. బాధబాధగా..

“ఫోన్ చేయండి సార్..”హెచ్ఎం..

“హలో..ఓ..థ్యాంక్సండీ.. వెంటనే స్పందించారు.. థ్యాంక్సండీ..ఓకే అండీ”

అర్థమయినట్టుంది..హెచ్ఎం కళ్ళలో వెలుగు.. కుర్చీలోంచి లేస్తున్నాడు..“ఏమయింది సార్..బ్యాగూ నగలు ఉన్నాయా..?”

“ఉన్నాయి సార్..బ్యాగును మేడం చేతికి ఇచ్చారు..అందులో అన్ని వస్తువులు ఉన్నాయి. ఇప్పుడు మేడం వాళ్లు చిత్తూరు బస్సెక్కి వస్తున్నారు..”

నీ రెండు చేతులూ పట్టుకున్నాడు..పెళ్ళి చేయాల్సిన కూతురున్న హెచ్ఎం.. ప్రైవేటు ఉద్యోగి.. పిల్లలను భావి పౌరులుగా తీర్చిదిద్దే ధీరుడు.. భీరుడు.. గణగణ... గంట మోగుతోంది..హెచ్ఎం థ్యాంక్స్ చెబుతూనే ఉన్నాడు.. దానికి ఇప్పట్లో బ్రేక్ ఉండదు.. నీ కల(ళ)ల పంట వచ్చింది..

“ఓకే..వస్తాంసార్..” దుర్ర్‌ర్..గేరు మార్పు.. ఏ గేరు.. స్కూలు గేరు.. కథ గేరు.. కథ రాయాలి.. ఇంటికి పోతూనే కథ రాసేయాలి..అటు తిప్పు, ఇటు తిప్పు..నేరుగా పోనీ..నేరుగా.. ముక్కుసూటిగా.. ఇబ్బంది కాదా..

“ఇంత సేపు ఎక్కడికి పోయారండీ కథ రాయకుండా..” శ్రీమతి.. ఆహా ఏమి నీ మతి.. ఎంత బాగా గుర్తుంది కథ గురించీ..

కథలాగా చెప్తావా..లేదు టాకీగానే.. కథ రాయాలిగా..అయితే చెప్పు..హెచ్ఎం సంగతి చెప్పేశావా..కథ.. మొదలు పెట్టు..స్నానం చేయనీ.. శరీరం తేలికవుతుంది.. మనసు చురుకవుతుంది.. అయితే జంతువులు రోజూ స్నానంచేస్తున్నాయా..? పక్షులు స్నానం చేస్తున్నాయా..అవి చురుగ్గా లేవా..? అయితే స్నానం చేసేవాళ్ళంతా చురుగ్గా ఉన్నారా..? ఎంతమంది యువత రంగుల కలలు కంటూ., శరీరమంతా సోమరితనం నింపుకుంటూ.. బరువెక్కి., లావెక్కి., అటకెక్కిన నడకకు మోక్షం తెప్పించి..కథా నాయిక నడిచినంత మాత్రాన

లావు తగ్గుతుందా..అసలు ఇంట్లో పనులన్నీ వదులుకోని లావు తగ్గడం కోసం కొత్తనడక మొదలు పెట్టడం సాధ్యం అవుతుందా..? అవుతుంది.. కొత్తకథ, కొత్త నడక..వీలవుతుంది..

కవిత టీ తెచ్చింది.."కథ రాసేస్తా.."

"రాయండి..మిమ్మల్ను ఎవురు అడ్డుకుంటున్నారు.. వూర్లో అందరి పనులూ నెత్తినేసుకోని తిరుగుతాంటారు.. కనీసం లీవు పెట్టిన రోజన్నా బయట పనులు తగ్గించుకోవచ్చు కదా..?"

బాగున్నాయి ప్రశ్నలు..నీకు..కథ ముఖ్యమా, ఇతరులకు నీవు చేయగలిగిన సాయం ముఖ్యమా..? ఏది ముఖ్యం..?ఎవరి బుద్ధిని బట్టి వారి ప్రాధాన్యాలు..అయితే నీ బుద్ధి ఎలాంటిది..?

కథ మొదలు పెట్టాలి..పేపర్లు తీసుకో..పేనా తీసుకో..రాసింది చదువుకో..

ఆమె వెన్నెలను తాగిన జాజితీగలా ఉన్న తన ఫోటోను తదేకంగా చూస్తోంది..గాలి ఊదిన బూరలా ఉన్న తన దేహం గురించి ఆలోచిస్తోంది.. ఏవి తల్లీ నిరుడు నాపై కురిసిన సౌందర్య రేఖలు..

"సార్..సార్..మా నాయన రమ్మంటాండాడు.." ఇంజనీర్ కొడుకు.. పదహారేళ్లవాడు.. పడుచు అమ్మాయిలా ఉన్నవాడు..

"ఏమంట.?" కవిత.

"తాతకు ఆరోగ్యం బాగలేదు..లేవలేకుండా ఉండాడు..డాక్టర్‌ను రమ్మంటే రావటం లేదు.." యంత్రంలా మాటలు.

"పదా.." దగ్గరే కదా..మెల్లగానే నడు..

"రా వెంకటేష్..నాయన చూడు ఎట్లున్నాడో..డాక్టర్ దగ్గరకు ఇప్పటికి గంటనుంచీ నాలుగుసార్లు పోయొచ్చినాం..అయినా రాలేదు.." బాధ, దిగులు, కోపం..ఇంజనీర్‌లో.

"ఏ డాక్టర్.."

"వీధి చివరన ఉండాడే..ముకుందరావు.."

"నేను పోయొస్తాలే.."

ఫాస్ట్ ఫాస్ట్.. ఇంటికి పో.. నీ బైక్ తీసుకో.. ఫాస్ట్ ఫాస్ట్..

"హలో సార్.. ఒక్క పదినిముషాలు రండిసార్.. సిస్టర్ ఉంటారులే.."

అరే.. మరో మాట కూడా మాట్లాడకుండా వచ్చి బైక్‌లో కూర్చున్నాడే..

"మా ఇంటి దగ్గర ఉండాడే ఇంజనీర్..వాళ్ళనాన్నకు ఆరోగ్యం బాగలేదు.." బైక్ ఆపు..దగ్గరే కదా ఇల్లు..

"అప్పుడే వాళ్ళొచ్చి వెళ్ళారు..సాయంత్రం కదా..పేషెంట్లు ఎక్కువగా ఉన్నారు.."

"రండి సార్..రండి"

పెద్దాయనకు నాడి పట్టి చూస్తున్నాడు..సెలైన్ పెట్టాడు.. ఇంజక్షన్ చేశాడు. "ఐపోయే ముందు వచ్చి చెప్పండి వస్తాను.."

ఇంజనీర్ కొడుకు డాక్టర్‌ను దింపను పోయాడు నీ బైక్‌లో..నీ బైక్ ఎప్పటికి వస్తుందో..

"నేనూ ఇంటికి పోతాను సార్..ఏదన్నా అవసరం అయితే ఫోన్ చేయండి"

"అయ్యయ్యో.. మీరుండండి సార్.. మేము ఎన్నిసార్లు పోయినామో డాక్టర్ దగ్గరకు. ఆయన రాలేదు.. కనీసం సెలైన్ అయిపోయేదాకా అయినా ఉండండి" అభ్యర్థన ఇంజనీరు. ఇళ్లరూపశిల్పి..

నీకు తప్పదులే ఉండు.. నీకు కథపైన మనసు ఉంటే కదా.. పెద్దాయనకు ఆరోగ్యం తిరగబడింది.. ఇంజనీర్‌లో ఆదుర్దా.. పెద్దాసుపత్రికి పోండి.. డాక్టర్ల పరుగులు.. పరీక్షలు.. ఇంటికి వచ్చేప్పటికి పది గంటలు..

ట్యూబ్ లైటు వెలుగుతోంది.. పాప నిద్ర పోతోంది.. అమ్మ, కవిత టివి చూస్తున్నారు.

"భోంచేయరా.." కవిత.

"ఎందుకు భోంచేయను. ఎప్పుడు ఏం పని చేయాలో అప్పుడు ఆపని తప్పకుండా చేస్తాను.."

చేతులు కడుక్కో.. భోజనానికి కుచ్చో.. అమ్మ కూడా కుచ్చునిందా.. "నువ్వేమి..కూర్చో..వడ్డించుకుందాం..పాప తినేసిందా.."

"పాప తినేసిందండీ.." కవిత కూడా కూర్చుంది భోజనానికి..

మాటలు దొర్లుతున్నాయి..మీ దైనందిన కార్యక్రమాల్లో ఎదురైన సమస్యలు, పరిష్కరించిన తీరు, ఎవరి పట్ల కోపం వచ్చింది, ఎందుకు కోపం వచ్చింది.. భోజనం పూర్తయింది. కడుపు నిండింది. మనసు తేలికయింది...

"ఏమండీ..తింటానే పోయి మంచం ఎక్కారే.. కథ రాయరా..? టైమింకా పదకొండేకదా.." కవిత నిన్ను కథ రాయమని ప్రోత్సహిస్తాందా.. రాయలేదని ఎగతాళి చేస్తాందా..?

"నిద్ర వస్తాంది..పద్దన్నే లేస్తానే కొత్తకథ రాస్తాలే.."

కళ్ళు మత్తుగా ఉన్నాయే.. మొత్తానికి కొత్త కథ రాయకుండానే రోజంతా గడిపేశావా? ఇలా అయితే నువ్వు కథ రాసినట్టే..

కథ రాసినంత తృప్తిగానే ఉంది మనసుకు.. ప్రశాంతంగా నిద్ర పడుతోంది.. నన్ను డిస్టబ్ చేయద్దు..

•

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 25 మార్చి 2007***